సాక్షి
ఖమ్మం
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



తుప్పపడుతున్న 104..

జిల్లా పెద్దాస్పత్రి ఆవరణలో 104 వాహనాలు తుప్పు పడుతుండగా నేడు వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. 8లో



అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం రోజంతా కనిష్ట స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రివేళ చలి పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలంలో పర్యటించనున్న మంత్రి సీసీ, బీటీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, మధ్యాహ్నం 3గంటల నుంచి కూసుమంచి మండలంలో మంత్రి పర్యటిస్తారు. పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేస్తారు.

డయల్‌ 100కు 3,431 ఫోన్లు

ఖమ్మంక్రైం: అత్యవసర సమయాన ప్రజలు పోలీసుల సాయం తీసుకునేందుకు ఏర్పాటుచేసిన డయల్‌ 100కు నవంబర్‌ నెలలో 3,431 మంది ఫోన్‌ చేశారని పోలీసు కమిషనర్‌ సునీల్‌దత్‌ వెల్లడించారు. ఇందులో 67 ఫోన్లకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు. ఇందులో చోరీలు, రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, కొందరికి అవగాహన లేక తప్పుడు సమాచారం ఇస్తున్నారని, అలాకాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్‌ 100 ఫోన్‌ చేయాలని సీపీ సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలనకు బృందం

ఖమ్మం సహకారనగర్‌: గత సెప్టెంబర్‌ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు నష్టపోయారు. ఆయా ప్రాంతాల్లో పరిశీలనకు రాష్ట్రప్రభుత్వం నియమించిన బృందం సోమవారం జిల్లా బృందం వచ్చింది. ఈ బృందంలోని అధికారులు మంగళవారం నుంచి వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలించి వివరాలు తెలుసుకోనున్నారు. తొలుత వారు మంగళవారం ఉదయం ఉదయం కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌తో సమావేశమవుతారు. ఈమేరకు వరదల నాటి పరిస్థితులను బృందానికి వివరించేలా అధికార యంత్రాంగం ఫొటో ఎగ్జిబిషన్‌ ఏర్పాటుచేయనుంది.

ఉమ్మడి జిల్లాకు కొత్త అంబులెన్స్‌లు

11 వాహనాలను కేటాయించిన ప్రభుత్వం



నూతన 108 వాహనం

ఖమ్మంవైద్యవిభాగం: రాష్ట్రప్రభుత్వం వివిధ జిల్లాలకు కొత్తగా 108 అంబులెన్స్‌లను కేటాయించింది. ఆయా వాహనాలను సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతీ మండలానికి ఒక వాహనం ఉండాలనే ఉద్దేశంతో వాహనాలు లేని మండలాలకు నూతన వాహనాలు సమకూర్చింది. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 11వాహనాలు కేటాయించగా.. ఖమ్మం జిల్లాకు ఐదు, భద్రాద్రి జిల్లాకు ఆరింటిని పంపించారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 17 వాహనాలు ఉండగా చింతకాని, కొణిజర్ల, పెనుబల్లి, వేంసూరు, కారేపల్లి మండలాలకు కొత్తగా వాహనాలు సమకూర్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 22 వాహనాలు ఉండగా జూలూరుపాడు, ఎస్‌ఎస్‌పురం, ఊటుకూరు, అశ్వారావుపేట, చుంచుపల్లి, గుండాల పీహెచ్‌సీలకు ప్రస్తుతం ఆరు కేటాయించారు. ఈ వాహనాల్లో సేవలందించేందుకు పైలట్‌, టెక్నీషియన్లను ఇప్పటికే నియమించి శిక్షణ కూడా ఇచ్చారు. దీంతో రెండు, మూడు రోజుల్లో అంబులెన్స్‌లో అందుబాటులోకి వస్తాయని ఉమ్మడి జిల్లా 108 మేనేజర్‌ బి.నాగేందర్‌ తెలిపారు.

నీలాద్రీశ్వరుడి హుండీ ఆదాయం రూ.7.63లక్షలు

పెనుబల్లి: పెనుబల్లి మండల పరిధిలోని నీలాద్రీశ్వరాలయ ఆలయం హుండీల్లో కార్తీక మాసం సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈమేరకు రూ.7,63,981 ఆదాయం నమోదైందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ అనిల్‌కుమార్‌ తెలిపారు. ఆలయ ఈఓ పాకాల వెంకటరమణతో పాటు చీకటి చిన్ననరసింహారావు, రామిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మెడికల్‌ కాలేజీ భవనాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తదితరులు

7న మెడికల్‌ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన

- మంత్రి దామోదర రాజనర్సింహతో పనులకు అంకురార్పణ
- ఆగస్ట్‌ 15కల్లా సత్తుపల్లి నియోజకవర్గానికి గోదావరి జలాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలోనే ఖమ్మం మెడికల్‌ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలనేది జిల్లా ప్రజల ఆకాంక్ష అని, అందుకు అనుగుణంగా నిర్మాణ స్థలాన్ని ఎంపిక చేయడమే కాక భవన నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రఘునాథపాలెం మండలం బైపాస్‌ రోడ్డు సమీపంలో ప్రభుత్వ మెడికల్‌ కళాశాల భవన నిర్మాణాలకు ఎంపిక చేసిన స్థలాన్ని మంత్రి సోమవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణానికి ఈనెల 7న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేస్తారని తుమ్మల తెలిపారు. అటు మెడికల్‌ కళాశాలతోపాటు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, అదనపు సిబ్బంది అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కాగా, స్వామి నారాయణన్‌ స్కూల్‌కు సంబంధించి స్థలం ఎంపిక చేయగా కేబినెట్‌ సమావేశంలో ఆమోదం లభించిందని తెలిపారు. ఆ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 68 పాఠశాలలు నిర్వహిస్తుండగా ఎక్కడా ఉచిత సీట్లు ఇవ్వలేదన్నారు. కానీ ముఖ్యమంత్రి సూచనలతో గిరిజనులు, పేదలు, బీసీలకు ఇక్కడ నిర్మించే పాఠశాలలో వెసులుబాటు ఇవ్వమని కోరామని చెప్పారు. అలాగే, ఇంటిగ్రేటెడ్‌ స్కూల్‌కు కేటాయించిన స్థలం నుంచి అక్రమార్కులు మట్టి తరలించడంతో గుంతలు ఏర్పడ్డాయని, ఈ ప్రాంతం బాగున్నందున గోతులు పూడ్చయినా ఇక్కడే పాఠశాల నిర్మిస్తామని స్పష్టం చేశారు.

యాతాలకుంట టన్నెల్‌ పూర్తయితే లక్ష ఎకరాలకు నీరు..

సత్తుపల్లి మండలంలో యాతాలకుంట వద్ద టన్నెల్‌ పూర్తయితే సత్తుపల్లి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరు వస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సీతారామ ప్రాజెక్టు పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని, వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా వేంసూరు, సత్తుపల్లి, దమ్మపేట, పెనుబల్లి మండలాల్లో ఆయకట్టుకు సాగునీరు వచ్చేలా తాను బాధ్యత తీసుకున్నానని తెలిపారు. రఘునాథపాలెం మండలానికి సాగర్‌ జలాలు అందేలా తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బుగ్గవాగు డైవర్షన్‌ స్కీమ్‌ మంజూరు చేయించానని, ఇప్పుడు రూ.66 కోట్లతో మంచుకొండ లిఫ్ట్‌ ఇరిగేషన్‌ స్కీమ్‌ నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే టెండర్లు ఖరారు చేసి సంక్రాంతిలోపు పనులు మొదలు పెడతామని, ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 30 చెరువులను నింపుతామని వివరించారు.

ఆయిల్‌పామ్‌ టన్ను ధర రూ.20వేలకు..

ఆయిల్‌పామ్‌ సాగు చేసే వారికి రాష్ట్రప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తున్నందున రైతులు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయిల్‌పామ్‌ సాగు చేసేవారు కరువు, ప్రకృతి వైపరీత్యాలు, కోతులు, దొంగలకు భయపడాల్సిన పని లేదన్నారు. పామాయిల్‌ గెలల టన్ను ధర రూ.19,144 నుంచి సోమవారం రూ.20,411కు చేరిందన్నారు. తాను మంత్రిగా ఉన్న మొదటి సంవత్సరంలో టన్ను ధర రూ.13,075 ఉండగా ధర పెంచుతామని అప్పుడే చెప్పి కేంద్రాన్ని ఒప్పించినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్‌ సాగు చేసే రైతులకు మొక్కలు, డ్రిప్‌, మందులు ఇవ్వడమే కాక అంతర్గత పంటలకు కూడా నగదు చెల్లిస్తామని చెప్పారు. కాగా, హరియాణా, పంజాబ్‌, ఆంధ్రప్రదేశ్‌ కన్నా వరి తెలంగాణలోనే ఎక్కువగా పండుతోందన్నారు. ఈ ఏడాది 1.53 కోట్ల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని తెలిపారు. రైతులకు ప్రభుత్వం చేయాల్సిన సాయం ఎంతో ఉందని, ఇప్పటికే 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.20వేల కోట్లకు పైగా రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. అలాగే, రైతు భరోసా కూడా అందజేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు.

జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి..

సూర్యాపేట–ఖమ్మం, కోదాడ–ఖమ్మం జాతీయ రహదారుల పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ఖమ్మం – కురవి పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఖమ్మం–దేవరపల్లి పూర్తయితే విజయవాడ, రాజమండ్రి వెళ్లేందుకు సమయం, దూరం కలిసొస్తుందన్నారు. కొత్తగూడెం నుంచి ఇల్లెందు, తొర్రూరు మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారికి టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు. మంచిగా పనులు చేసే అధికారులు జిల్లాలో ఉన్నారని, కలెక్టర్‌, పోలీస్‌ కమిషనర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ కూడా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారని ప్రశంసించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌, సీపీ సునీల్‌దత్‌, అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, కార్పొరేటర్‌ లకావత్‌సైదులు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఈఈ యుగంధర్‌, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్‌ విల్సన్‌బెన్నీ, మాజీ ఎంపీ రవీంద్రనాయక్‌, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్‌, తాతా రఘురాం పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించండి

కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

ఖమ్మం సహకారనగర్‌: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్‌.. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం సదరం సర్టిఫికెట్ల జారీకి ఏర్పాటుచేసిన సహాయక కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, డీఆర్వో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో జిల్లా నుంచి ఎంపికై శిక్షణ తీసుకుంటున్న లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని బీజేపీ నాయకులు గల్లా సత్యనారాయణ, తాండ్ర వినోద్‌రావు, నంబూరి రామలింగేశ్వరావు తదితరులు కోరారు. అలాగే, బోనకల్‌ మండల కేంద్రంలోని మూడు వైన్స్‌ల్లో ధరలు పెంచి అమ్ముతున్నారని న్యూడెమోక్రసీ నాయకులు ఫిర్యాదు చేయగా, ఖమ్మం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన ఎం.వెంకటనర్సమ్మ తన ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో రావడం లేదని, ఇంటి నంబర్‌ తప్పుగా పడినందున సరిచేయించాలని కోరారు. ఇంకా మరికొందరు పలు సమస్యలపై వినతాపత్రాలు అందజేశారు.

లక్ష్యం మేరకు హెచ్‌ఐవీ పరీక్షలు

ఖమ్మంవైద్యవిభాగం: నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ సూచించారు. రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ జిల్లాకు కేటాయించిన అంబులెన్స్‌ను కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ, అసిస్టెంట్‌ కలెక్టర్‌ మ్రినాల్‌ శ్రేష్టతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబులెన్స్‌లో హెచ్‌ఐవీ పరీక్షలకు అవసరమైన కిట్లు ఉన్నందున ఉచితంగా పరీక్షలు చేస్తున్న విషయంతో పాటు పరీక్షల షెడ్యూల్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

వైద్యవిద్యార్థులు బాధ్యతగా చదివి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్‌ కాలేజీల్లో పారామెడికల్‌ కోర్సులను వర్చువల్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో జరిగిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ ఎంబీబీఎస్‌, పారామెడికల్‌ కోర్సులు చదివే విద్యార్థులు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం అసిస్టెంట్‌ కలెక్టర్‌ శ్రీజ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అసిస్టెంట్‌ కలెక్టర్‌ మ్రినాల్‌ శ్రేష్ట, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ఎల్‌.కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, అధికారులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు డాక్టర్‌ డి.రామారావు, డాక్టర్‌ సైదులు, కె.కొండలరావు, వి.శివ, ఏ.సుందర్‌రావు, డి.సత్యకుమార్‌, ఎం.నాగయ్య, ఎం.డీ.మహమ్మద్‌ ఆలీ, వీరయ్య, రామకృష్ణ, రంగారావు, డి.సురేష్‌, సుధాకర్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్‌

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లినిక్‌ను సోమవారం కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ ప్రారంభించారు. అనంతరం వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు ప్రతీ గురువారం ఇక్కడ డెర్మటాలజీ, సైక్రియాట్రిక్‌, జనరల్‌ మెడిసిన్‌ వైద్యులు సేవలందిస్తారని తెలిపారు. అలాగే, ఇద్దరు కౌన్సిలర్లను కూడా కేటాయించినట్లు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ఎల్‌.కిరణ్‌కుమార్‌, హెచ్‌ఓడీ సర్జన్‌ బి.కిరణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెరగాలి

- విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి సారించండి
- రాష్ట్ర విద్యా కమిషన్‌ చైర్మన్‌ ఆకునూరి మురళి



కూసుమంచి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న చైర్మన్‌

కూసుమంచి/ఖమ్మం అర్బన్‌/రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్యా కమిషన్‌ చైర్మన్‌ ఆకునూరి మురళి అభిప్రాయపడ్డారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన కూసుమంచి, జీళ్లచెరువులోని ఉన్నత పాఠశాలలతో పాటు ఖమ్మంలోని మైనార్టీ బాలికల పాఠశాల, రఘునాథపాలెంలోని కేజీబీవీని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో వసతులు, హాజరు వివరాలు తెలుసుకున్నాక తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కొందరు విద్యార్థులు తెలుగు కూడా సరిగ్గా చదవలేకపోతుండడంతో అసంతృప్తిని వ్యక్తం చేసిన చైర్మన్‌ అందరు విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాగా, పాఠ్యపుస్తకాల్లో తెలుగు, ఇంగ్లిష్‌ భాషల్లో పాఠ్యాంశాలు ఉండడంపై అభిప్రాయాలు సేకరించగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌లోనే పాఠ్యాంశాలు ఉండాలన్నారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచిని పరిశీలించి సరుకుల నాణ్యతను పరీక్షించారు. ఇటీవల రాష్ట్రంలోని పలుచోట్ల ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి కొన్ని ఘటనలు జరగడంతో వాస్తవాలను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామని మురళి తెలిపారు. ఈకార్యక్రమాల్లో డీఈఓ సోమశేఖరశర్మ, డీఐఈఓ రవిబాబు, సంక్షేమ శాఖల అధికారులు కస్తాల సత్యనారాయణ, జ్యోతి, విజయలక్ష్మి, ప్రిన్సిపాల్‌ శ్రీలత, ఎంఈఓ రాయల శేషగిరిరావు, సీఎంఓ రాజశేఖర్‌తో పాటు అడిషనల్‌ డీడీ అబ్దుల్‌ రవూఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ కల్లూరు ఎస్‌ఈగా వాసంతి



ఎస్‌ఈకి శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

సత్తుపల్లి(కల్లూరు): జలవనరులశాఖ కల్లూరు ఎస్‌ఈగా జి.వాసంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఈగా ఉన్న ఆనంద్‌కుమార్‌ అక్టోబర్‌లో ఉద్యోగ విరమణ చేయగా, నరసింహారావుకు ఇన్‌చార్జ్‌ బాధ్యతలు అప్పగించారు. ఇటీవలే రెగ్యులర్‌ ఎస్‌ఈగా వాసంతిని నియమించడంతో ఆమె విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఈఈ లక్ష్మీనారా యణ, డీఈలు వెంకటేశ్వరరావు, రాజారత్నాకర్‌, ఏఈలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నాలుగు దశల్లో సీఎం కప్‌ క్రీడోత్సవాలు

- ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం
- ఆన్‌లైన్‌ ద్వారా క్రీడాకారుల నమోదు



సీఎం కప్‌ పోటీల మస్కట్‌

ఖమ్మం స్పోర్ట్స్‌: సీఎం కప్‌ పేరిట క్రీడోత్సవాలను నాలుగు దశల్లో నిర్వహించేందుకు స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ తెలంగాణ(శాట్స్‌) కార్యాచరణ విడుదల చేసింది. ప్రతీ క్రీడాంశానికి సంబంధించి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని డీవైఎస్‌ఓలకు సూచించింది. ఈ పోటీలు పంచాయతీ, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపికచేస్తారు. గ్రామ స్థాయిలో ఈనెల 7, 8న, మండల స్థాయిలో 10నుంచి 12 వరకు, జిల్లా స్థాయిలో 16నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 27నుంచి జనవరి 2వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయాల్సి ఉంటుంది.

ఏయే అంశాల్లో...

గ్రామ మండలస్థాయిలో అథ్లెటిక్స్‌, ఫుట్‌బాల్‌, వాలీబాల్‌, కబడ్డీ, యోగా పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయికి వచ్చే సరికి వీటికి తోడు బ్యాడ్మింటన్‌, బాక్సింగ్‌, స్విమ్మింగ్‌, రెజ్లింగ్‌, బాస్కెట్‌బాల్‌, హ్యాండ్‌బాల్‌, చెస్‌, బేస్‌బాల్‌, సైక్లింగ్‌, నెట్‌బాల్‌, ఉషూ, జూడో, బిలియర్డ్స్‌, స్నూకర్‌ పోటీలు ఉంటాయి. అలాగే, రాష్ట్రస్థాయిలో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడలతో పాటు అదనంగా ఆర్చరీ, టేబుల్‌ టెన్నిస్‌, లాన్‌టెన్నిస్‌, వెయిట్‌ లిఫ్టింగ్‌, జిమ్నాస్టిక్స్‌, షూటింగ్‌, సెపక్‌తక్రా, కరాటే పోటీలు నిర్వహిస్తారు. కాగా, జిల్లాలో మూడు స్థాయిల్లో పోటీలు సమర్థవంతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులు తమ వివరాలను cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్‌ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

మాటలు కాదు.. చేతల్లో చూపిస్తాం..



- ఇప్పటికే రూ.281 కోట్లతో అభివృద్ధి పనులు
- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం..

ఏడాది పాలనపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్‌ రాగమయి

సత్తుపల్లి: 'మా కుటుంబం నిరంతరం ప్రజలతోనే ప్రయాణం చేస్తోంది.. మా వద్దకు వచ్చే ప్రతీ ఒక్కరికి మాటలతో కాకుండా చేతల్లో చేతనైనంత సాయం చేయటమే మా లక్ష్యం. ఇది చూసే ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు..' అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్‌ మట్టా రాగమయి దయానంద్‌ వెల్లడించారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు. మానవ విలువలను కాపాడుతూ ప్రజల సంక్షేమమే తొలి ప్రాధాన్యతగా పని చేస్తున్నానని తెలిపారు. అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యమని వెల్లడించిన ఆమె కొన్నిచోట్ల పోడు భూములకు పట్టాలు లేక రైతుబంధు, సన్నాలకు బోనస్‌ రావడం లేదనే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఏడాది కాలంలో చేసిన పనులు, భవిష్యత్‌ ప్రణాళికలపై ఎమ్మెల్యే వెల్లడించిన అంశాలు ఆమె మాటల్లోనే...

రూ.281 కోట్లకుపైగా..

సత్తుపల్లి నియోజకవర్గంలో గడిచిన ఏడాదిలో రూ.100 కోట్లతో అంతర్గత రహదారులు, సీసీరోడ్లు, డ్రెయిన్ల పనులు చేపట్టాం. రూ.120 కోట్లతో ఇంటిగ్రేటెడ్‌ హాస్టల్‌ భవన నిర్మాణం, రూ.18 కోట్లతో నర్సింగ్‌ కళాశాల, రూ.39 కోట్లతో వెంగళరావునగర్‌ నుంచి కిష్టారం వరకు సెంట్రల్‌ డివైడర్‌తో నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇకపోతే గత ప్రభుత్వంలో నిధులు మంజూరు లేకున్నా ఎన్నికల ముందు హడావుడిగా చేపట్టిన షాదీఖానా, అంబేద్కర్‌భవనం, చాకలి ఐలమ్మ భవన పనులకు నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతమయ్యేలా చూస్తున్నాం. హాస్టళ్లలో విద్యార్థులకు సరైన బెడ్‌ సౌకర్యం లేకపోవటంతో రూ.2 కోట్లతో అన్ని హాస్టళ్లకు పరుపులను అందించాం.

సింగరేణి సంస్థ నుంచి..

సత్తుపల్లి ప్రాంతంలో సింగరేణి గనులతో నష్టపోయిన బాధితులకు అండగా నిలిచేందుకు వారి సమస్యలను అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం ఓ కొలిక్కి వచ్చింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సత్తుపల్లి పట్టణం వెంగళరావునగర్‌లో స్వయంగా పర్యటించి సింగరేణి బాంబ్‌ పేలుళ్లతో జరుగుతున్న నష్టాలను తెలుసుకున్నారు. కిష్టారం గ్రామంలో సుమారు 200 ఇళ్లు బాంబ్‌ పేలుళ్లతో దెబ్బతిన్నందున కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ను తీసుకొచ్చి సింగరేణి నుంచే బాధితులకు ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం ఈ ప్రక్రియ టెండర్ల దశలో ఉంది. కిష్టారం అంబేద్కర్‌నగర్‌ వాసులు సైలోబంకర్లతో వస్తున్న కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులపై సింగరేణి ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేశాం.

ప్రణాళికాయుతంగా ముందుకు..

ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించుకుని వచ్చే నాలుగేళ్లలో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతాం. బుగ్గపాడు ఫుడ్‌ పార్కులో పరిశ్రమలు స్థాపించి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ సైతం తీసుకొచ్చాం. దీంతో యువతకు శిక్షణ ఇచ్చే వీలు ఏర్పడుతుంది. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పామాయిల్‌ ఫ్యాక్టరీ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అంతేకాక బాలుర జూనియర్‌ కళాశాల నూతన భవన నిర్మాణం, మినీ ఆడిటోరియం, ఓపెన్‌ ఆడిటోరియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రజల నుంచి వచ్చే వినతులు, డిమాండ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కారానికి నా వంతు ప్రయత్నం చేస్తున్నా.

క్లుప్తంగా

విద్యా కమిషన్ చైర్మన్‌ను కలిసిన అధికారులు



చైర్మన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా పర్యటనకు సోమవారం వచ్చిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని సంక్షేమశాఖల అధికారులు, వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం బాధ్యులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా మెనూ సక్రమంగా అమలు చేయాలని, చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎస్.విజయలక్ష్మి, బీసీడీఓ గుడికందుల జ్యోతి, సంక్షేమ అధికారులు ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు కోటపాటి రుక్మారావు, నెల్లూరి నాగేశ్వరరావుతో పాటు నాగమణి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక అధికారిని..



పశువైద్యాధికారి నారాయణను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశుసంవర్ధక, పశు వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కే.వీ.నారాయణను సోమవారం పశువైద్య ప్రతినిధుల బృందం కలిసింది. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారుల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌బాబు, డాక్టర్ ఎం.ఉపేందర్‌తో పాటు డాక్టర్ అనంతు హరీష్, డాక్టర్ సంజయ్‌రెడ్డి, అశోక్, సుబ్బారావు, భువనేశ్వర్ కుమార్, గంగాధర్, నాగులు తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా జిల్లాలో పాడి రైతులకు మెరుగైన సేవలందించాలని నారాయణ సూచించారు.

కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు శిక్షణ

ఖమ్మంరూరల్: నూతన విద్యావిధానానికి అనుగుణంగా కేంద్రీయ విద్యాలయలో 8వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పోలెపల్లిలోని కేంద్రీయ విద్యార్థులకు గతనెల 25నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇవ్వగా సోమవారం ఆయన సమావేశమయ్యారు. విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్ నేర్చుకోగా ఆ వివరాలు తెలుసుకుని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి కదలికలపై ఆరా



సీసీ కెమెరాలో నమోదైన గుర్తు తెలియని వ్యక్తి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడం పలు షాపుల్లోని సీసీ కెమెరాల్లో నమోదైంది. దీంతో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పారిపోయి వచ్చాడా, చోరీ కోసం వచ్చాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మండల కేంద్రంలో దంపతుల హత్య జరగగా సెల్‌ఫోన్ పడేసి వెళ్లిన వ్యక్తి, సోమవారం తెల్లవారుజామున వచ్చిన వ్యక్తి ఒకరేనా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, సోమవారం మండల పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి తదితరులతో దంపతుల హత్య కేసు విచారణపై ఆరా తీశారు. త్వరగా నిందితులను గుర్తించాలని సూచించినట్లు తెలిసింది.

భర్తను పోలీసులకు అప్పగించిన మహిళ

ఖమ్మంక్రైం: రోటరీనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా ఆయన భార్య పలుమార్లు హెచ్చరించింది. అయినా వినకపోవడంతో సోమవారం సదరు వ్యక్తి మరో మహిళతో ఉండగా ఆయన భార్య, బంధువులు పట్టుకుని దాడి చేశారు. అనంతరం వారిద్దరిని ఖమ్మం టు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,600	6,600
మిర్చి	15,600	6,000
మిర్చి తాలు	7,200	6,000
ఏసీ మిర్చి	16,320	7,000
ఏసీ తాలు	7,200	6,000
పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

పెద్దాస్పత్రి వెనుకభాగంలో ఉన్న 104 వాహనాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ (ఫైల్)



తుప్పపడుతున్న 104 వాహనాలు..

- వైద్య, ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంతో రెండేళ్లకు పైగా మూలనే
- నేడు వేలం వేయనున్నట్లు ప్రకటించిన అధికారులు
- ఉద్యోగులకు నెలలుగా అందని వేతనాలు

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘ కాలం సేవలు అందించిన 104వాహనాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. దివంగత వైఎస్.రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2008లో ప్రవేశపెట్టిన ఈ వాహనాల ద్వారా లక్షలాది మందికి వైద్యసేవలు అందాయి. అయితే, గత ప్రభుత్వం 2022 జనవరిలో ఈ సేవలను రద్దు చేయగా, జిల్లాలో 11 వాహనాలను ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వెనుక భాగాన పక్కకు పడవేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వాహనాలను వేలం వేసినా ఖమ్మం జిల్లా వాహనాలను పక్కన పెట్టడంతో వానకు తడిచి, ఎండకు ఎండి తుప్పుపట్టాయి. గతంలో రెండు సార్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వేలం ప్రకటించినా ఒక్కో వాహనం ధర రూ.1.60లక్షలుగా నిర్ణయించడంతో కొనుగోలుకు ఎవరూ రాలేదు. గత వారం ఆస్పత్రికి వచ్చిన అదనపు కలెక్టర్ శ్రీజ ఈ విషయమై అధికారులను మందలించారు. దీంతో వాహనాలను మంగళవారం వేలం వేయాలని నిర్ణయించారు. ఈసారైన వాహనాలను ఎవరైనా కొనుగోలు చేస్తే ప్రభుత్వానికి కాస్తయినా ఆదాయం సమకూరనుంది.

లక్షలాది మందికి సేవలందించి....

సుదీర్ఘ కాలం పాటు లక్షలాది మందికి 104 వాహనాల ద్వారా వైద్యసేవలు అందించాయి. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఈ వాహనాల ద్వారా సేవలందించేవారు. ఈ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దుచేయడంతో ఉద్యోగులను జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. నాన్ కమ్యూనల్ డిసీజ్ ప్రోగ్రామ్, టీ హబ్, పీహెచ్‌సీల్లో వారి సేవలను వినియోగించుకుంటున్నారు. అయితే వీరికి వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

నేడు వాహనాల వేలం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన 104 వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.కళావతిబాయి తెలిపారు. స్వరాజ్ మజ్దా కంపెనీ 2008 మోడల్‌కు చెందిన 11 వాహనాలను వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగే వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష డీడీ లేదా చెక్‌ను ఖమ్మం వైద్య ఆరోగ్య శాఖ పేరిట సమర్పించాలని సూచించారు.

తక్షణం వేతనాలు చెల్లించాలి



మాకు పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలి. సుమారు ఐదు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థకు అప్పగించడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియమితులైన మమ్ముల్ని రెగ్యులర్ చేయడం లేదంటూ పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిలోకైనా మార్చి ట్రెజరీ ద్వారా జీత భత్యాలు చెల్లించాలి.

– మన్మధరావు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగులపై నిర్లక్ష్యం

104 వాహనాల్లో పనిచేసిన ఉద్యోగులు ప్రస్తుతం సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రతీ వాహనంలో ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్ సేవలందించేవారు. ఇలా ఖమ్మం జిల్లాలో 85 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60 మంది ఉద్యోగులు ఉండగా ఇతర విభాగాల్లో సర్దుబాటు చేసినా ఈ ఏడాది జూలై నుండి జీతాలు చెల్లించకపోవడంతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ గోడు పట్టించుకుని పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

వసూళ్లపైనే ప్రత్యేక దృష్టి !

- మధిర సర్కిల్‌లో ఓ ఎస్సై తీరుపై విమర్శలు
- ఇసుక అక్రమ రవాణా, సెటిల్‌మెంట్లపై ఆరోపణలు
- వరుస చోరీలు జరుగుతున్నా అరికట్టడంలో నిర్లక్ష్యం

మధిర: మధిర సర్కిల్ పరిధిలోని ఓ ఎస్సై తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్ పరిధిలో రోజుకొకటి అన్నట్లుగా చోరీలు జరుగుతున్నా పెట్రోలింగ్ పెంచడం, నిందితుల గుర్తింపునకు విచారణ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తుండగా.. అక్రమ దందాలు చేసే వారికి సహకరిస్తోందన్న ప్రచారంపై స్థానికులు మండిపడుతున్నారు. కొన్నిసార్లు బయట.. ఇంకొన్ని సార్లు పోలీ స్టేషనే అడ్డాగా సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇక మండలంలో దొంగతనాలు సర్వసాధారణం కాగా, ఒక్కోరోజు రెండు నుంచి మూడు చోరీలు జరుగుతుండడంతో స్థానికులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు.

అంతా రికార్డు అయినా..

గత గురువారం ఒకేరోజు పోలీసుస్టేషన్ పరిధిలో రెండు చోట్ల చోరీకి ప్రయత్నం చేయగా.. మరో రెండుచోట్ల చోరీ జరిగింది. ఇందులో కొన్ని ఘటనలకు సంబంధించి సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. ఆ రోజు ఉదయం 11గంటలకు మధిర శ్రీ నగర్ కాలనీలో రెండు ఇళ్లల్లో చోరీకి ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఆత్కూర్‌లోని ఒక ఇంట్లో చొరబడి రూ.1.50 లక్షలు, మడుపల్లిలో వేమిరెడ్డి నారాయణరెడ్డి ఇంట్లో రూ.2 లక్షల విలువైన బంగారం, రూ.30వేల నగదు చోరీ చేశారని బాధితులు తెలిపారు. ఇవే కాకుండా గతంలోనూ అనేక చోట్ల దొంగతనాలు జరిగాయి. అయినా పెట్రోలింగ్ పెంచకపోగా.. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించడంపైనా శ్రద్ధ కనబర్చడం లేదని బాధితులు వాపోతున్నారు.

కేసుల నమోదులో జాప్యం

మధిర రైల్వే స్టేషన్ రోడ్డులో దుకాణం నిర్వహిస్తున్న బవిరిశెట్టి సీతారాములును అక్టోబర్ 19న నమ్మబలికిన ఓ దుండుగుడు రూ.99వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. ఈ విషయమై సీతారాములు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా పలుమార్లు తిప్పించుకుని పది రోజుల తర్వాత కాని నవంబర్ 3న ఫిర్యాదు తీసుకున్నారు. చివరకు ఫోన్ పే చేయించుకున్న వ్యక్తి ఆచూకీ లభించినా తీసుకొచ్చేందుకు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక తమకు చాలా ఖర్చులు ఉన్నందున డబ్బులు ఇవ్వాలని ఓ వ్యాపార సంస్థల అసోసియేషన్ బాధ్యులను డిమాండ్ చేసినట్లు సమాచారం. అలాగే, మధిరలోని లడకబజార్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో 2021 నవంబర్ 1న చోరీ జరిగింది. ఈ ఘటనలో చెవి దిద్దులు, ఉంగరాలు తదితర బంగారు ఆభరణాలు, కంప్యూటర్ ట్యాబ్‌తో పాటు రూ.30వేలు నగదు చోరీకి గురయ్యాయి. అయితే, నవంబర్ 20న ఆ ఉపాధ్యాయుడిని పిలిచి ట్యాబ్ మాత్రమే ఇచ్చి పంపినట్లు తెలిసింది. ట్యాబ్ దొరికినప్పుడు నిందితుడి సమాచారం కూడా తెలుస్తుందని, పూర్తిస్థాయిలో విచారించి నగదు, ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉన్నా అలా జరగకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో సదరు పోలీసు అధికారి పనితీరుపై విమర్శలు వస్తుండగా.. ఆయనతో పాటు పోలీసు ఉన్నతాధికారులు సైతం హెచ్చరించినా పనితీరు మార్చుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది.

అన్నీ వివాదాలే...

ఆ పోలీస్ అధికారిణి విధుల్లో చేరినప్పటి నుంచి వివాదాలు వెంటాడుతున్నాయి. మొన్నటి వరకు ఇసుక అక్రమ రవాణాలో ఆమె పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చాయి. గతంలో పేకాట ఆడిన వారి నుంచి డబ్బు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఇక ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వచ్చినా, ఏదైనా ఘటనల్లో పట్టుబడినా పోలీస్‌స్టేషన్‌లోనే ఇరువర్గాలకు సెటిల్‌మెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యం

మధిర: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే రాష్ట్రప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం తెలిపారు. మధిరలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రజా పాలన విజయోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సారథ్యాన ప్రభుత్వం హామీలను అమలుచేస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశామని చెప్పారు. అనంతరం కళాకారులు ప్రభుత్వ పథకాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, తహసీల్దార్ రాంబాబు, కమిషనర్ సంపత్ కుమార్, డీపీఆర్‌ఓ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవాలను ప్రారంభిస్తున్న నాయుడు సత్యం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జాతీయవాది..

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మధిర: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జాతీయవాదిగా పనిచేస్తున్నారని.. ఇదేసమయంలో బూటకపు హామీలు ఇచ్చి విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి అవకాశవాదిగా మిగిలిపోయారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. మధిరలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరిట ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎంకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించడం గర్హనీయమన్నారు. రైతు రుణమాఫీ 50శాతం కూడా పూర్తి చేయకపోగా, మహిళలకు రూ.2,500, రైతుభరోసా తదితర హామీలేమీ అమలుచేయలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ మధిర అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, నాయకులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, నూతక్కి నరసింహారావు, కుంచం కృష్ణారావు, మర్సకట్ల స్వర్ణాకర్, దేవరకొండ కోటేశ్వరరావు, మీనుగు శంకర్, బాడిశ అర్జున్ రావు, కత్తి రవి, మాదిరాజు సాయిరాం, అంకె హన్మంతరావు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

స్కూల్ బస్సును ఢీకొట్టిన కారు

తృటిలో తప్పిన ప్రమాదం

సత్తుపల్లిటౌన్: విద్యార్థులతో వస్తున్న స్కూల్ బస్సును కారు ఢీకొట్టగా, తృటిలో పిల్లలు ప్రమాదం నుంచి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం సత్తుపల్లి నుంచి గంగారం వైపు వెళ్తున్న కారు స్థానిక హనుమాన్‌నగర్ బంక్ వద్ద అడ్డొచ్చిన సైకిలిస్ట్‌ను తప్పించే క్రమాన గంగారం వైపు నుంచి సత్తుపల్లి వస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును వేగంగా ఢీకొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. ఆ వెంటనే డ్రైవర్ చాకచక్యంగా బస్సును వెనక్కి తీసుకురావడంతో పిల్లలకు ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన విద్యార్థులను కిందకు దింపి మరో వాహనంలో పంపించారు. కాగా, ఘటనలో కారు ముందు నుజ్జునుజ్జు కాగా, పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.



ప్రమాదానికి కారణమైన కారు



ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన ఆగిన స్కూల్ బస్సు

ప్రమాదకరంగా విద్యుత్ టవర్

ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపాన ఆదివారం ఉదయం యాష్ ట్యాంకర్ అదుపు తప్పి విద్యుత్ టవర్‌ను ఢీకొట్టింది. దీంతో టవర్ వంగిపోయి తీగలు వేలాడుతూ ప్రమాదంగా మారినా అటు విద్యుత్ అధికారులు కానీ ఇటు పోలీసులు కానీ సోమవారం వరకు కూడా స్పందించలేదు. దీంతో తీగలు తెగిపడినా, టవర్ పూర్తిగా కూలినా ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ట్యాంకర్ ఢీకొనడంతో వంగిపోయిన టవర్

నేడు సాఫ్ట్‌బాల్, సైక్లింగ్ ఎంపిక పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల అండర్ – 14, 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్, సైక్లింగ్ పోటీలు కొత్తగూడెం రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఈఓలు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరాచారి తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారితో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని వెల్లడించారు. కాగా, క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటోతో కూడిన అర్హత పత్రం, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని, పుట్టిన రోజు ధ్రువపత్రం లేకపోతే అనుమతించబోమని తెలిపారు. వివరాలకు పాఠశాలల క్రీడా కార్యదర్శులు వాసిరెడ్డి నరేష్‌కుమార్, నర్సింహమూర్తి లేదా 94934 66866, 93983 07367, 99512 74678 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లవర్స్‌కు అనుమతి లేదు !

ఎక్కడైనా పార్కుల వద్ద సైకిళ్లు, వాహనాలు తీసుకురావొద్దని, చెత్తాచెదారం పడేయొద్దనే సూచనలతో బోర్డులు చూస్తుంటాం. కానీ ఖమ్మంలోని మున్సిపల్ కార్పొరేషన్ పక్కన ఉన్న ఫ్రీడమ్ పార్క్ వద్ద ఏర్పాటుచేసిన బోర్డును మాత్రం ప్రతిఒక్కరు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఇక్కడ బోర్డుపై సైకిళ్లు పార్క్ లోపలికి తీసుకురావొద్దని, సాయంత్రం 4 గంటల తర్వాత క్రికెట్ ఆడొద్దనేవి రెండు సూచనలు ఉన్నాయి. ఇక మూడోది మాత్రం 'లవర్స్‌కు అనుమతి లేదు' అని రాశారు. పార్క్‌కు చిన్నాపెద్ద వాకింగ్ కోసం వస్తుండగా గంటల తరబడి తిష్ట వేస్తున్న కొన్ని జంటలు ప్రవర్తిస్తున్న తీరుతో ఇబ్బందులు వస్తుండడంతోనే ఇలా బోర్డు ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది.



పార్క్ ఫెన్సింగ్‌కు కట్టిన బోర్డు

– ఖమ్మంమయూరిసెంటర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: మండలంలోని అనంతనగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని అనంతపురానికి చెందిన దేవేంద్ర సాహు, పూర్ణచంద్ర సాహు రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. సోమవారం రాత్రి వారు విధులకు బైక్‌పై వస్తుండగా అనంతనగర్ వద్ద బోదులబండ నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

సెల్‌టవర్‌ను దగ్ధం చేసిన మావోయిస్టులు

చర్ల: పీఎల్‌జీఏ వారోత్సవాల ప్రారంభం రోజే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి బీజాపూర్ జిల్లా తోయ్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోర్మెట్‌లో సెల్ టవర్ దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్‌తో ఆదివాసీ గ్రామాల్లో కమ్యూనికేషన్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన మొబైల్ టవర్ ఏర్పాటు చేసింది. పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన మావోయిస్టులు తొలిరోజే ఆ సెల్ టవర్‌తో పాటు కంట్రోల్ రూం, ప్యానల్ బోర్డు వద్ద పెద్ద కలప దుంగలను వేసి నిప్పంటించారు. టవర్ వద్ద పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలంటూ వెస్ట్ బస్తర్ డివిజన్ కమిటీ పేరిట కరపత్రాలు వదిలారు. ఈ ఘటనపై మొబైల్ కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోయిన సెల్ టవర్ ప్యానల్ బోర్డు

ఉరి వేసుకుని ఆత్మహత్య

వేంసూరు: ఒంటరితనానికి తోడు అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వెంకటాపురానికి చెందిన షేక్ మస్తాన్(55) కొన్నేళ్ల క్రితం భార్యతో గొడవ పడగా మనస్పర్థలు రావడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈక్రమాన మరో మహిళకు దగ్గర కాగా ఆమెతోనూ గొడవలు అయ్యాయి. ఇంతలోనే మస్తాన్‌ను అనారోగ్యం దరిచేరడంతో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనపై ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని...

ఖమ్మంరూరల్: మండలంలోని పడమటితండాకు చెందిన పదో తరగతి విద్యార్థిని మాలోత్ ఐశ్వర్య(15) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొంతకాలంగా ఐశ్వర్య కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబీకులు చికిత్స చేయిస్తున్నారు. అయినా తగ్గకపోవడంతో గతనెల 29న పురుగుల మందు తాగిన ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఐశ్వర్య సోమవారం మృతి చెందగా ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

పురుగుల మందు తాగి లారీడ్రైవర్...

పెనుబల్లి: లారీ యజమాని ఇంటికి వచ్చి మందలించాడనే మనస్థాపంతో లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన కుటుంబీకులు వెల్లడించారు. వివరాలు... పెనుబల్లి మండలం లంకపల్లికి బీమాల ఏసు (50) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ సత్తుపల్లి మండలం కిష్టారంలో నివాసముంటున్నాడు. ఆయన బొగ్గు లోడ్‌తో సత్తుపల్లి నుండి చిల్లకల్లు వెళ్తుండగా విసన్నపేట వద్ద లారీ దిగబడింది. దీంతో ఏసు లారీని అక్కడే వదిలేసి వచ్చాడు. ఈమేరకు యజమాని ఇంటికి వచ్చి ఏసును మందలించగా మనస్థాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగాడని, తాము సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆయన భార్య వెల్లడించింది. ఘటనపై సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపింది.

క్లుప్తంగా...

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి వీడ్కోలు..

అమెరికా వెళ్లిపోతున్న బీఆర్‌ఎస్ నేత



వీడ్కోలు సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా సుమారు 24 ఏండ్ల పాటు పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ నేతలు సోమవారం తెలంగాణ భవన్‌లో వీడ్కోలు పలికారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశంలో పలువురు నేతలు పార్టీకి శ్రీనివాస్‌రెడ్డి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. శేష జీవితాన్ని అమెరికాలో గడిపేందుకు వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ ఉద్యమ అనుభవాలను క్రోడీకరించి పుస్తకం రాయాల్సిందిగా నాయకులు కోరారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్‌రెడ్డి అనేక కీలక ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారన్నారు. మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనా చారి తదితరులు శ్రీనివాస్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని వివరించారు. కాగా, తనకు మంచి గుర్తింపును ఇచ్చిన పార్టీ అధినేత కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను వసూళ్లలో 15 శాతం వృద్ధి

ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పన్ను వసూళ్లలో తెలంగాణ మంచి వృద్ధిరేటు చూపుతోందని, గతేడాదితో పోలిస్తే 15 శాతం వృద్ధి సాధించిందని ఆదాయ పన్ను శాఖ తెలంగాణ, ఏపీల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత తెలిపారు. తెలంగాణ, ఏపీ కలిపి ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం రూ.1,21,000 కోట్లు కాగా, ఇందులో ఇప్పటివరకు రూ.59,000 కోట్ల మార్కును చేరుకున్నామని చెప్పారు. పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామనే ఆశా భావంతో ఉన్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) సోమవారం ఉదయం ఆదాయపు పన్నుపై నిర్వహించిన సమావేశంలో మధుస్మిత మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో కలిపి రూ. 2 లక్షల కోట్ల పన్ను పెండింగ్‌లో ఉందని తెలిపారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం అనేది భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆదాయపు పన్ను శాఖ నినాదం అని ఆమె చెప్పారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

- మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పోచారం/నిజాంపేట/బీబీనగర్/భానుపురి (సూర్యాపేట): వేర్వేరు కాలేజీల్లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

అన్నోజిగూడ నారాయణ కళాశాలలో...



తనుష్‌నాయక్ (ఫైల్ ఫొటో)

బీబీనగర్ మండలంలోని పెద్దపలుగు తండాకు చెందిన బానోతు తనుష్‌నాయక్ (16) తల్లిదండ్రులు నగరానికి వలస వచ్చి కుషాయిగూడలోని చక్రీపురంలో ఉంటున్నారు. అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో తనుష్‌ను ఇంటర్ ఫస్టియర్(ఎంపీసీ)లో చేర్పించారు. సోమవారం సాయంత్రం హాస్టల్ బాత్‌రూమ్‌లోకి వెళ్లిన తనుష్ ఎంత సేపటికీ బయటకు రాలేదు. దీంతో తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తలుపులు పగులగొట్టి చూడగా..తనుష్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో నేరుగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. తనుష్‌కు ఫిట్స్ వచ్చాయని కళాశాల



నారాయణ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిర్వాహకులు చెబుతుండగా..అధ్యాపకుల ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.

ఎస్ఎస్ఆర్ కళాశాలలో...

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం చిన్నతడం గ్రామానికి చెందిన ప్రజ్ఞారెడ్డి ప్రగతినగర్‌లోని ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ ఐఐటీ గర్ల్స్ క్యాంపస్‌లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రజ్ఞారెడ్డి తాను ఉంటున్న హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని దాచి పెట్టిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుందా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ ఐఐటీ క్యాంపస్‌కు ఇంటర్ బోర్డు అనుమతి లేదని సమాచారం.

ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో....

సూర్యాపేట జిల్లా కోదాడ స్నేహ నర్సింగ్ కళాశాలలో అసోం రాష్ట్రానికి చెందిన నర్గిస్ పర్వీన్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో బుధవారం రాత్రి కాలేజీ హాస్టల్‌లో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను సూర్యాపేట ఆస్పత్రిలో చేర్పించగా..కోలుకుంది. మళ్లీ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేయడంతో సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులతో కలిసి ఆమె సూర్యాపేటలోని కలెక్టరేట్‌కు వచ్చింది. వారంతా కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో బాధిత విద్యార్థిని తన వెంట తెచ్చుకున్న శానిటైజర్ తాగి మళ్లీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో వెంటనే కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్గిస్ పర్వీన్‌ను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పరామర్శించారు.

రాష్ట్ర వన్యప్రాణి బోర్డు పునర్వ్యవస్థీకరణ

సభ్యులుగా పలువురు ఎమ్మెల్యేలు, స్వచ్ఛంద సంస్థలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వన్యప్రాణి బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. మూడేళ్లపాటు కొనసాగనున్న ఈ బోర్డు... ఏడాదికి కనీసం రెండు సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రక్షిత ప్రాంతాల ప్రకటన, వన్యప్రాణుల సంరక్షణ, ఏవైనా ప్రత్యేకతలున్న మొక్కల పరిరక్షణ, ఏదైనా షెడ్యూల్‌కు సవరణలు, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఇతర ప్రజల అవసరాలకు తగ్గట్టు గా తగిన చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం చేసే సూచనలు వంటి వాటిని ఈ బోర్డు పరిశీలించనుంది. తదను గుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వనుంది. బోర్డు చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్‌పర్సన్‌గా అటవీ, పర్యావ రణశాఖ మంత్రి కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ బోర్డులో సభ్యులుగా... ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు (ఖానాపూర్), సీహెచ్ వంశీకృష్ణ (అచ్చంపేట) మురళీనాయక్ (మహబూబాబాద్)లను నియమించారు. వన్యప్రాణులతో ముడిపడిన రంగాలు, కార్యకలాపాల్లో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థల నుంచి... డబ్ల్యూడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ ఆఫీస్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సంస్థాపక కార్యదర్శి ఇమ్రాన్ సిద్దిఖి, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అవినాష్ విశ్వనాథన్‌లు సభ్యులుగా నియమి తులయ్యారు. పర్యావరణ వేత్తలు... లాకోన్స్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఉమాపతి, విశ్రాంత ఐఎఫ్ఎస్ ఎంఏ వహీద్, నెహ్రూ జూపార్క్ వెటర్నరీ కన్సల్టెంట్ డా.నవీన్‌కుమార్, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.వాసుదేవ రావు, ఈ కేటగిరీలో ఇంకా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు (పినపాక), రాందాస్ మాలావత్ (వైరా)లను సభ్యులుగా నియమించారు. ఇంకా... ఇతర సభ్యులుగా అటవీ, గిరిజన, ఇతర శాఖల ప్రతినిధులు, పీసీసీఎఫ్ నియమితులయ్యారు. ఈ బోర్డు సభ్యకార్యదర్శిగా చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ (అరణ్యభవన్) వ్యవహరిస్తారు. సోమవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

తేలని 'విభజన' చర్చలు!

- తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన అంశాలపై జరిగిన తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ ఏమీ తేల్చకుండానే ముగిసింది. కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైనా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. వచ్చే సమావేశం నాటికి ఆయా అంశాలపై నిర్దిష్టమైన ప్రతిపాదనలతో రావాలని తీర్మానించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ జరిగి పదిన్నరేళ్లు అవుతున్నా చాలా సమస్యలు అలాగే ఉండిపోయిన విషయం తెలిసిందే. అలా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించేందుకు... ఇరు రాష్ట్రాల సీఎస్‌ల ఆధ్వర్యంలోని అధికారుల కమిటీ సోమవారం ఏపీలోని మంగళగిరిలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో సమావేశమైంది.

15 అంశాలపై చర్చించినా..

సుమారు రెండు గంటల పాటు జరిగిన కమిటీ భేటీలో... ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న 15 అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు చర్చల్లో పాల్గొన్న తెలంగాణ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున త్వరగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల సీఎస్‌లు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ ఏడాది జూలై 6న ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమై జరిపిన చర్చలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి నిర్ణయించినట్టు వివరించారు. ఈ మేరకు వచ్చే సమావేశం నాటికి ఈరోజు చర్చించిన అంశాలపై నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని తీర్మానించినట్టు తెలిపారు. ఇందుకోసం ఆయా శాఖల అధికారులు ముందుగా సమావేశమై చర్చించుకోవాలని, పరిష్కారానికి అవసరమైన వివరాలు సేకరించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. త్వరలో కమిటీ మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్టు తెలిపారు.

మంత్రుల కమిటీకే 'విద్యుత్'అంశం

ఇక రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాల అంశంలో నెలకొన్న వివాదాన్ని మంత్రుల కమిటీకి వదిలేయాలని సీఎస్‌ల కమిటీ నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే రూ.861 కోట్ల లేబర్ సెస్ నిధులను పంపిణీ చేసుకోవాలని, ఉద్యోగుల పరస్పర బదిలీలపై విస్తృతంగా చర్చించాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఈ అంశాలపై సీఎంలకు నివేదించిన తర్వాత తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' ఎప్పుడు దెబ్బతింది?

- కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లను డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు
- 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వాటిని గుర్తించడం వెనక ఆంతర్యమేంటి?
- రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ మాజీ ఎస్ఈ మురళీకృష్ణకు పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నలు
- ఆయన అమెరికాలో ఉండటంతో వర్చువల్‌గా సాగిన క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: 'వరదనీటి మళ్లింపు కోసం నిర్మించే బరాజ్‌లను నీటినిల్వ డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు? 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ కింద 2023 జూలైలో కాళేశ్వరం బరాజ్‌లను డ్యామ్ లుగా గుర్తించడం వెనక అంతర్యం ఏమిటి?' అని రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ (ఎస్డీఎస్ఓ) మాజీ ఎస్ఈ మురళీకృష్ణను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం అమెరికాలో ఉన్న మురళీకృష్ణను వర్చువల్‌గా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

చట్టంలో ఉన్నందునే పరిగణించాం..

'డ్యామ్‌ల రక్షణ చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? మీరు అఫిడవిట్లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? మీ బాధ్యతలేంటి?' అని కమిషన్ మురళీకృష్ణను ప్రశ్నించింది. అందుకు ఆయన బదులిస్తూ 2021 డిసెంబర్ 30న నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను నోటిఫై చేశారని పేర్కొన్నారు. 15 మీటర్ల ఎత్తు కలిగి, నీటిని నిల్వ చేసే జలాశయాలతోపాటు 10 మీటర్లకు మించి ఎత్తున్న చెక్ డ్యామ్‌లను కూడా డ్యామ్‌లుగా పరిగణించాలని చట్టంలో ఉందని మురళీకృష్ణ తెలియజేశారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ 'నీటిని మళ్లించడానికే బరాజ్‌లు కడతారు.. మరి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను డ్యామ్‌లుగా ఎలా పరిగణించారు? అని మళ్లీ ప్రశ్నించింది. చట్ట ప్రకారం స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా బరాజ్‌లను నోటిఫై చేశారని మురళీకృష్ణ వివరించారు. డ్యామ్‌ల రక్షణ చట్టం అమలు కోసం క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించామని.. ఆయా డ్యామ్‌లను సమగ్రంగా పరిశీలించి నోటిఫై చేయించామని తెలిపారు. బరాజ్‌లు ఎప్పుడు పూర్తయ్యాయని కమిషన్ ప్రశ్నించగా 2023లో స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా నోటిఫై చేశామన్నారు. 2021లో చట్టం వస్తే 2019లోనే బరాజ్ పూర్తవడం వాస్తవమా? కాదా? అని కమిషన్ అడగ్గా వాస్తవమేనని చెప్పారు. పదేపదే విజ్ఞప్తుల అనంతరం స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో బరాజ్‌లను చేర్చారని బదులిచ్చారు. 2019లో మేడిగడ్డలో వరదలు వచ్చాయని, తొలుత సుందిళ్ల, అన్నారంలో బుంగలు ఏర్పడ్డాయని, ఆ తర్వాత మేడిగడ్డ దెబ్బతిందని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే బరాజ్‌ల అధికారులు ఈ విషయాన్ని నివేదించలేదని మురళీకృష్ణ వెల్లడించారు.

రెండో వారంలో మళ్లీ విచారణ

నాలుగో విడత క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేసిన జస్టిస్ చంద్రఘోష్.. మంగళవారం సాయంత్రం కోల్‌కతా తిరిగి వెళ్లనున్నారు. అనంతరం రెండో వారంలో తిరిగి హైదరాబాద్ వచ్చి ఐదో దఫా విచారణలో ఈఎన్సీలు, మాజీ ఈఎన్సీలను ప్రశ్నించనున్నారు. ఆ తర్వాత ఐఏఎస్‌లను విచారించే అవకాశాలున్నాయి.

జిల్లా వార్తలు

రామయ్యకు రూ.4లక్షల విలువైన హారం



ముత్యాలహారం అందజేస్తున్న దాత

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు సోమవారం రూ.4లక్షల విలువైన హారాన్ని సమర్పించారు. హైద్రాబాద్‌కు చెందిన భక్తుడు దీపక్ ముత్యాలహారాన్ని అందజేయగా స్వామి వారి పాదాల చెంతన ఉంచి పూజలు చేశారు. అతర్వాత ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్‌కు అందచేయగా అధికారులు దాతను సత్కరించారు.

రాణా.. మొక్కలతో కళకళ!



ఆవరణలో పూలమొక్కలతో గార్డెన్

ములకలపల్లి పోలీసుస్టేషన్ కొత్త అందాలు సంతరించుకుంది. స్టేషన్ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి అందంగా తీర్చిదిద్దారు. అలాగే, గార్డెన్‌లో పూలమొక్కల మధ్య గడ్డి తొలగించి పాదులు చేయడంతో పాటు క్రోటాన్ మొక్కలను అందంగా కత్తిరించారు. కుండీల్లో పూల మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ వేయించారు. ఈ పనులతో సుమారు ఐదేళ్ల క్రితం ప్రారంభమైన పోలీస్‌స్టేషన్ ఆవరణ, పరిసరాలు సరికొత్తగా కనిపిస్తున్నాయి. –ములకలపల్లి



స్టేషన్ చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్

స్టేషన్ ఆవరణలో క్రోటాన్ మొక్క

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ వద్దిరాజు



ఉపరాష్ట్రపతితో కలచాలనం చేస్తున్న రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంట్ సమావేశాల నేపథ్యాన సోమవారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌ను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి చాంబర్‌లో ఆయనను కలిసిన రవిచంద్ర కాసేపు సమావేశమయ్యారు.

రేపు మాజీ సీఎం రోశయ్య వర్ధంతి సభ

కొణిజర్ల: హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈనెల 4వ తేదీన(బుధవారం) జరగనున్న మాజీ సీఎం కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి సభకు జిల్లాలోని ఆర్యవైశ్యులు తరలిరావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు కొణతం ఉమాశంకరరావు, గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాస్, అనుమోలు ప్రసాద్, పసుమర్తి శంకర్, జవాజి నాగేశ్వరరావు కోరారు. కొణిజర్లలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుండి సభకు వెళ్లే ఆర్యవైశ్యులకు ఉచిత బస్సు సౌకర్యం, భోజన వసతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

సరిహద్దుల్లో ముమ్మరంగా కూంబింగ్

- పీఎల్‌జీఏ వారోత్సవాలు ప్రారంభం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఆదివాసీలు

చర్ల/దుమ్ముగూడెం: మావోయిస్టు పార్టీ సోమవారం నుంచి ఈనెల 8వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యాన ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. పీఎల్‌జీఏ ఆవిర్భవించి 24 ఏళ్లు అవుతున్న సందర్భంగా అమరులకు నివాళులర్పించడంతో పాటు పెద్ద ఎత్తున వారోత్సవాలు నిర్వహించాలని పార్టీలోని పలు కమిటీలు పిలుపునిచ్చాయి. ఇదే కాక ఆదివారం ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు చేపడుతున్నారు. ఈ మేరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఛత్తీస్‌గఢ్‌కు తరలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారోత్సవాలను అడ్డుకునేలా మూడు రాష్ట్రాల సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ తదితర విభాగాల పోలీసులు దండకారణ్యంలో ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నారు.

భయాందోళనలో ఆదివాసీలు

ఇటీవల తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున పోలీసు క్యాంపులు ఏర్పాటవుతుండగా వీటిని వ్యతిరేకిస్తూ ఆదివాసీలు పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసు క్యాంపులపై మావోయిస్టులు దాడులకు దిగుతున్నారు. ఈ తరుణాన వారోత్సవాలు జరుగుతుండడంతో ఆదివాసీల్లో మరింత ఆందోళన నెలకొంది. అడవుల నుంచి మైదాన ప్రాంతాలకు, మైదానం నుంచి అటవీ ప్రాంతాలకు ఎవరెవరు వెళ్తున్నారని అటు మావోయిస్టులు, ఇటు పోలీసులు కూపీ లాగుతూ తమను ఇబ్బంది పెడుతున్నారని వాపోతున్నారు. మరికొందరు అటవీ ప్రాంత గ్రామాల ఆదివాసీలు పెద్ద ఎత్తున వస్తున్న పోలీసులను చూసి భయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారని తెలుస్తోంది. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లోని నిమ్మలగూడెం, కర్రిగుండం, పుట్టపాడు, తెట్టెమడుగు, డోకుపాడు, కంచాల, కొరగట్ల, మీనగట్ట, జబ్బగట్ట, గుండ్రాయి తదితర గ్రామాల్లో పురుషులంతా ఇతర ప్రాంతాలకు వెళ్లగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలే ఇళ్లలో ఉన్నారని సమాచారం. ములుగు జిల్లాలో ఎన్‌కౌంటర్ జరగడంతో మావోయిస్టులు కూడా ప్రతిదాడికి దిగుతారనే అనుమానంతో వారంతా బిక్కుబిక్కుమంటూ గుడుపుతున్నారని తెలిసింది.



కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహనాల తనిఖీలు

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యాన దుమ్ముగూడెం మండలంలోని మారుమూల గ్రామాలతో పాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలీసు బలగాలు కూంబింగ్ చేస్తుండగా.. మైదాన ప్రాంతంలో సీఐ అశోక్‌కుమార్ నేతృత్వాన ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్ వాహన తనిఖీలను ముమ్మరం చేశారు అనుమానితులను ప్రశ్నిస్తూ పత్రాలు పరిశీలిస్తున్నారు. ములుగు జిల్లా ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న కొందరు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే అవకాశమున్నందున పోలీసు బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి.

వెదురు నర్సరీ, బ్యాంబో క్లస్టర్‌ను పరిశీలించిన శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్/చంద్రుగొండ: భద్రాద్రి జిల్లాలో వెదురు సాగుకు అనుకూలతలు, సాగుతో లాభాలు, ఉత్పత్తులతో యువతకు ఉపాధి కల్పన, ప్రభుత్వ రాయితీలను తెలుసుకునేందుకు మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. ఈమేరకు అశ్వారావుపేట సమీపంలోని కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రంలో జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఆదేశాలతో పెంచుతున్న వెదురు మొక్కలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ గుంగా, రాహుల్ కుమార్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ సిద్ధి ఫెడ్నేకర్, అమృత బేల్సు పరిశీలించారు. ఈమేరకు వెదురు మొక్కల పెంపకం, లాభాలు, రాయితీలపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జంగా కిషోర్ వారికి వివరించారు. రైతులకు వెదురు మొక్కల్ని ఉచితంగా అందించి, మూడేళ్ల పాటు వరకు సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. పొలం గట్లపై సాగు చేస్తే మూడేళ్లకు రూ.15వేలు, పొలాల్లో పంట సాగు చేస్తే మూడేళ్లకు రూ.20వేల సబ్సిడీ కింద అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం శాస్త్రవేత్తల బృందం చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబోక్లస్టర్‌ను సైతం సందర్శించారు. ఇక్కడ వెదురుతో తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించాక వెదురు నర్సరీలో మార్కెటింగ్‌కు అనువైన రకాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ బయ్యారపు అశోక్, క్లస్టర్ చైర్మన్ వీసం నాగభూషణం, డైరెక్టర్లు మల్లం కృష్ణయ్య, కారం అన్వేష్, పద్దం భద్రయ్య, పంచాయితీ కార్యదర్శి రోహిత్‌తో పాటు బొర్రా సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట రూరల్ : వెదురు నర్సరీలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కిన్నెరసానిలో...

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శ్రీకాంత్ బృందం పరిశీలించింది. కలెక్టర్ సూచనలతో ఇక్కడకు వచ్చిన వారు డక్‌పాండ్, కేటీపీఎస్ కెనాల్, డ్యామ్ పరిసరాలు, డీర్‌పార్కును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆర్ఐ హచ్యా, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌బీఓ రాములునాయక్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన క్రీడాకారులు

పాల్వంచరూరల్: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో వేముల శివ, కె.లక్ష్మణ్, ఎం.చరణ్ వివిధ విభాగాల్లో సత్తా చాటగా జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. క్రీడాకారులను శంకరయ్యతోపాటు అసోసియేషన్ అధ్యక్షుడు సాదుల సారంగపాణితో పాటు క్రిస్టోఫర్‌బాబు, సుబ్రహ్మణ్యం, బొజ్జి మారెప్ప, బుద్ద ప్రసాద్, కొండి గణేష్ తదితరులు అభినందించారు.



చంద్రుగొండ : వెదురుతో రూపొందించిన ఉత్పత్తులను పరిశీలిస్తూ...